# 'కా॥జస్వంతరావు ఆశయ సాధనకు పూనిక వహించుదాం'
## సంస్మరణ సభలో సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకార్యదర్శివర్గ సభ్యులు కా॥ మధు పిలుపు




సంస్మరణసభలో ప్రసంగిస్తున్న కామ్రేడ్ మధు; పుస్తకావిష్కరణ సందర్భంగా వేదికపై వక్తలు

**విజయవాడ, 20-10-20 :**

**సిపిఐ(ఎం-ఎల్)** కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు, 'జనశక్తి', 'క్లాస్‌స్ట్రగుల్' పత్రికల సంపాదకులు, టి.ఎన్.మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి కామ్రేడ్ జస్వంతరావు ఆగస్టు 27న హైదరాబాద్‌లో మరణించిన విషయం విదితమే. కోవిడ్ పరిస్థితుల నేపధ్యంలో తగిన జాగ్రత్తల నడుమ 20-10-20 తేదీన విజయవాడ-మాకినేని బసవపున్నయ్య భవన్‌లో సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి ఆధ్వర్యంలో కా॥జస్వంత్ సంస్మరణసభ జరిగింది.

తొలుత ఉదయం 11 గం॥కు సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ మధు, కా॥జస్వంతరావు చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వరుసగా సభకు హాజరైన పార్టీ కేంద్రకమిటి సభ్యులు, రాష్ట్రకమిటి సభ్యులు, వివిధ ప్రజాసంఘాల బాధ్యులు, ఇతర పార్టీల ప్రతినిధులు, కుటుంబసభ్యులు, ప్రజాతంత్ర వాదులు కా॥జస్వంత్ చిత్రపటం వద్ద పూలను వుంచి జోహార్లు చెప్పారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి సభ్యుడు కా॥జె.కిషోర్‌బాబు వక్తలను వేదికపైకి ఆహ్వానించగా, సభకు సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥యస్.ఝాన్సీ అధ్యక్షత వహించారు.

కా॥జస్వంతరావు సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలోని మేలైన అంశాలను ప్రస్తావిస్తూ, సభ ప్రారంభంలో రాష్ట్రకమిటి తరపున కా॥ఝాన్సీ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కామ్రేడ్ జస్వంత్ విప్లవ మేధావి, వక్త, పత్రికా సంపాదకుడు, విప్లవ రాజకీయాలపట్ల అకుంఠిత విశ్వాసం, నిర్మాణ నిబద్ధతకలవాడు; కా॥జస్వంత్ నిరాడంబరుడు, స్నేహశీలి, మితభాషి అని పేర్కొంటూ దోపిడీవర్గ చర్యల మూలాల్లోకి వెళ్ళి విశ్లేషించటం ఆయన ప్రత్యేకతగా ఆ తీర్మానంలో గుర్తుచేశారు. కా॥జస్వంత్ స్మృతిలో సభికులంతా లేచి నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అమరులను స్మరిస్తూ ప్రజాకళాకారులు విప్లవగీతాలాలపించారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి ప్రచురించిన 'విప్లవ మేధోసైనికుడు కామ్రేడ్ జస్వంతరావు' పుస్తకాన్ని పార్టీ కేంద్రకార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ మధు ఆవిష్కరించి, సభలో ప్రసంగిస్తూ, పార్టీ ప్రధానకార్యదర్శి కామ్రేడ్ విశ్వం తరపున కామ్రేడ్ జస్వంత్‌కు జోహార్లర్పిస్తున్నానని తెలిపారు. కా॥జస్వంత్ విప్లవాచరణకు, జీవిత కార్యాచరణకు మార్క్సిజాన్ని మార్గదర్శిగా స్వీకరించాడన్నారు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలోని పాజిటివ్, నెగెటివ్ అనుభవాలన్నింటినీ స్వంతంచేసుకోవాలనే సరైన తాత్విక అవగాహన ఆయన కలిగివున్నారన్నారు. భారతదేశ నిర్దుష్ట రాజకీయ ఆర్థిక పరిణామాలను కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ఒరవడిలో కామ్రేడ్ జస్వంత్ విశ్లేషించాడన్నారు. ఐదు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో నాలుగు దశాబ్దాల కాలం పార్టీ పత్రికలకు సంపాదకత్వ బాధ్యతలు వహించి, విప్లవ మేధోసైనికునిలా కామ్రేడ్ జస్వంతరావు కృషి సాగించారన్నారు. ప్రస్తుత దేశ సంక్షుభిత రాజకీయాలను ప్రస్తావిస్తూ అమెరికా ఆధిపత్యానికి లొంగిన మన దేశ పాలకులు, వారి యుద్ధ రథచక్రాలకు మన దేశాన్ని కట్టివేస్తున్నారని, కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఫాసిస్టు తరహా పాలన సాగిస్తోందని వివరించారు. ఈ నేపధ్యంలో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్య ప్రజాఉద్యమం యొక్క అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. వ్యవస్థ మార్పుకొరకు, కామ్రేడ్ జస్వంత్ ఆశయ సాధనకొరకు పూనిక వహిద్దామని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగం ముగించారు.

కామ్రేడ్ జస్వంత్‌తో తమకున్న సాన్నిహిత్యాన్ని, కామ్రేడ్

జస్వంత్‌లో తాము గమనించిన నిబద్ధత, అంకితభావం, అణకువ, రాజకీయ అంశాలపట్ల రాజీలేని వైఖరి వంటి లక్షణాలను గుర్తుచేసుకుంటూ సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు కా॥అరవింద్‌సిన్హా, కా॥సుబోధ్‌మిత్రా, కా॥అలోక్‌ముఖర్జీలు పంపిన సందేశాలను సభికులకు విన్పించారు. కా॥జస్వంత్‌కు జోహార్లర్పిస్తూ కా॥మిత్ర రాసిన పాటను కా॥విమల గానం చేసిన వీడియోను ప్రదర్శించారు.

సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ మరో పది, పదిహేను సం॥లు విప్లవోద్యమ కృషిని కొనసాగించుతాడని భావించిన కా॥జస్వంత్ అకాలమరణం తనను, పార్టీ శ్రేణులను తీవ్ర విచారంలో ముంచి వేసిందన్నారు. దీనిని దిగమింగుకొని ఆ కర్తవ్యాలను ముందుకు కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యుడు కా॥పి.కె.షాహి (ఢిల్లీ) మాట్లాడుతూ కామ్రేడ్ జస్వంత్‌తో తమ అనుబంధం కొద్ది కాలానిదే అయినప్పటికీ ఆయన నిబద్ధత, రాజకీయ పరిణితి తమను బాగా ఆకట్టుకుందని, స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యుడు కామ్రేడ్ గుణలన్(తమిళనాడు) మాట్లాడుతూ కామ్రేడ్ జస్వంత్ మరణవార్త తమిళనాడు రాష్ట్రంలోని విప్లవశ్రేణులకు తీవ్ర విచారాన్ని కలిగించిందన్నారు. కోవిడ్ పరిస్థితుల కారణంగా ఒకచోట సమీకృతమై సంస్మరణసభ జరపలేకపోయాము కానీ, రైతాంగ పునాదిగల గ్రామీణ ప్రాంతాన్నెంచుకొని అక్కడ సభ జరిపిన విషయాన్ని తెలియజేశారు.

సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యుడు కామ్రేడ్ ప్రసాదన్న (తెలంగాణ) మాట్లాడుతూ సమాజంలో ఉన్నతమైన వైద్య విద్యనభ్యసించి, సంపన్న జీవితం గడపడానికి వచ్చిన అవకాశాలను కాలదన్ని, ఐదు దశాబ్దాలపైగా విప్లవోద్యమ కృషి సాగించటం స్ఫూర్తిదాయక మంటూ నివాళులర్పించారు.

సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కా॥చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కామ్రేడ్ జస్వంతరావు మరణం సిపిఐ(ఎం-ఎల్) పార్టీకి మాత్రమేగాక విప్లవ శ్రేణులందరికీ తీరని నష్టంగా పేర్కొన్నారు. ముఖ్యంగా, ప్రస్తుత పరిస్థితుల్లో అనేకమంది మేధావులు, వివిధ పార్టీలు కూడా భారత దేశంలో ఫ్యూడలిజం లేదని, పెట్టుబడిదారీ విధానమే కొనసాగుతుందని, సోషలిస్టు విప్లవమే సాగించాల్సి వుంటుందని సిద్ధాంతీకరించి, ప్రచారం చేస్తున్న నేపధ్యంలో అర్ధవలస-అర్ధఫ్యూడల్ భారత సమాజంలో సామ్రాజ్య వాదానికి ఫ్యూడలిజం ఏవిధంగా సాంఘిక పునాదిగా వుందో, సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, బూర్జువావర్గం ఏవిధంగా మిలాఖత్ అయినాయో సాధికారికంగా వివరించే విప్లవ మేధావిని కోల్పోవటం పట్ల తమ పార్టీ తరఫున తీవ్ర విచారం వ్యక్తంచేశారు.

సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసి రాష్ట్ర నాయకులు కా॥పి.ప్రసాద్ మాట్లాడుతూ తమ పార్టీ తరఫున నివాళు లర్పించారు. ఫాసిస్టుశక్తుల ప్రమాదం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాతంత్ర, అభ్యుదయ, వామపక్ష, లౌకికశక్తుల ఐక్యకార్యాచరణ, విప్లవశక్తుల ఐక్యత తక్షణ అవసరమని ఆయన పేర్కొన్నారు. బయట పరిస్థితులు విప్లవశక్తుల ఐక్యత ఆవశ్యకతను చాటి చెప్తున్నాయని, అందుకనుగుణంగా స్వీయాత్మక కృషి కూడా అంతర్గతంగా, చైతన్యయుతంగా జరగాలన్నారు.

విరసం నాయకులు కా॥అరసవెల్లి కృష్ణ మాట్లాడుతూ భారత సమాజంలోని సంక్లిష్టతలను, వైరుధ్యాలను విడమర్చి చెప్పే విలువైన విప్లవ మేధావి డా॥జస్వంతరావు అని పేర్కొంటూ నివాళులర్పించారు. గంభీరమైన సిద్ధాంతాన్ని కూడా సామాన్యులకు అర్థమయ్యే రీతిలో బోధించేవారన్నారు. భారత సమాజంపై ఆయన వేసిన ముద్ర చెరగనిదని పేర్కొంటూ, సమాజం ఆందోళనకర పరిస్థితుల్లోనున్న నేపధ్యంలో కా॥జస్వంతరావు మరణం అణగారిన వర్గాలందరికీ లోటని పేర్కొన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) జనశక్తి రాష్ట్ర నాయకులు కా॥మాస్టార్ మాట్లాడుతూ ప్రజల గురించి మాట్లాడిన వారిని అర్బన్ నక్సలైట్ల పేరున ప్రభుత్వం జైళ్ళలో పెడుతున్నదన్నారు. మరికొంతమందిపై భౌతికదాడులకు పాల్పడి నిర్మూలిస్తున్నదన్నారు. తమ దోపిడీకి ఆటంకం కల్గిస్తారని భావించిన వారందరిపై పాలకులు ఈరకమైన నిర్బంధాన్ని సాగిస్తున్న నేపధ్యంలో కా॥జస్వంత్ మరణం ఎంతో నష్టంగా పేర్కొంటూ ఆయనకు జోహార్లర్పించారు.

సిపిఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి కా॥పి.మధు మాట్లాడుతూ సమాజాన్ని, జరుగుతున్న రాజకీయార్థిక పరిణామాల్ని శాస్త్రీయంగా విశ్లేషించి, విడమరిచి ప్రజలకు తెలియజెప్పే మేధావుల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో కామ్రేడ్ జస్వంతరావు వంటి విప్లవ మేధావిని కోల్పోవటం చాలా బాధాకరమన్నారు. సమస్యల ప్రాతిపదికపై వామపక్షశక్తుల మధ్య ఐక్యకార్యాచరణ సాగుతోందని, రానున్న రోజుల్లో దీనిని మరింత శక్తివంతమైనదిగా రూపొందించాల్సిన అవసరముందని పేర్కొంటూ ఆయన కా॥జస్వంత్‌కు నివాళులర్పించారు.

సిపిఐ రాష్ట్రకార్యదర్శి కా॥రామకృష్ణ మాట్లాడుతూ వామపక్ష మేధావుల సంఖ్య తగ్గుతూ రావటమేగాక, మాట్లాడుతున్న వారిపై తీవ్ర నిర్బంధం కొనసాగుతూందని ప్రొ॥ సాయిబాబా,

కా॥వరవరరావులను ఉదహ రించారు. వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమ సాఫల్య, వైఫల్యాలపై మార్క్సిస్టు మేధావుల్లో చర్చ తీవ్రంగా జరగాల్సి వుందన్నారు. బిజెపి, సంఘ్‌పరివార్‌లకు కార్పొరేట్, కాషాయ ఎజెండా వున్నంత స్పష్టతగా, వామపక్ష, లౌకిక శక్తులందరిలో ఒక స్పష్టమైన, ఏకీకృతమైన ఎజెండా లేకపోవటం లోపంగా వుందన్నారు. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణ జరగాలని, ఒక జెండా, ఒకే ఎజెండా కలిగి వుండాలనే ఆశాభావాన్ని కా॥రామకృష్ణ వ్యక్తంచేస్తూ సిపిఐ పార్టీ తరపున కా॥జస్వంత్‌కు జోహార్లర్పించారు.

ఎంసిపిఐ(యు) రాష్ట్ర నాయకులు కా॥ఖాదర్‌బాషా మాట్లాడుతూ రోగులకు వైద్యంచేసే చదువు చదివి, సమాజానికి వైద్యం చేసే విప్లవ కార్యాచరణలో కా॥జస్వంతరావు కడదాకా కృషిసాగించారని పేర్కొంటూ వారి పార్టీ తరఫున జోహార్లర్పించారు.

ఎంసిపిఐ(యు) రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు కా॥గొల్లపూడి ప్రసాద్ మాట్లాడుతూ కామ్రేడ్ జస్వంతరావు మేధోసైనికుడనే మాట అక్షర సత్యమన్నారు. విద్యార్థిగా వున్న కాలంలోనే ఆయన కుల ఆధిపత్యాన్ని ధిక్కరించి, కళాశాలనుండి సస్పెండ్ అయ్యారని, ఆ దీక్ష, పట్టుదలతో మరింతగా పైకెదిగారని గుర్తు చేశారు. ఎంసిపిఐ(యు) రాష్ట్రకార్యదర్శి కా॥వెంకటరెడ్డి రాలేకపోయారని వివరిస్తూ, వారందరి తరఫున నివాళు లర్పించారు.

సిపిఐ(ఎం-ఎల్) లిబరేషన్ రాష్ట్రకమిటి సభ్యుడు కా॥హరనాథ్ మాట్లాడుతూ కనీస సమస్యల ప్రాతిపదికపైనైనా సవ్యంగా ఐక్యకార్యాచరణను కొనసాగించటం కామ్రేడ్ జస్వంత్‌కు అర్పించే నివాళిగా పేర్కొన్నారు. పార్లమెంటరీ భ్రమలు క్రమంగా తొలగి పోతున్నాయని పేర్కొంటూ ప్రజావ్యతిరేక చట్టాలకు, నిర్బంధానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కామ్రేడ్ జస్వంత్‌కు తమ పార్టీ తరఫున జోహార్లర్పించారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కామ్రేడ్ యస్.ఝాన్సీ ముగింపులో మాట్లాడుతూ పాలకులు మాట్లాడుతున్న సంస్కరణల స్వభావాన్ని కా॥జస్వంత్ సోదాహరణంగా వివరించేవారన్నారు. ఇటీవల కేంద్రప్రభుత్వం ముందుకు తెచ్చిన ప్రజావ్యతిరేక, రైతాంగ వ్యతిరేకమైన మూడు చట్టాలలోని అంశాలు-గత విధానాల కొనసాగింపేనన్నారు. కార్పొరేటు, కంపెనీ వ్యవసాయానికి చట్టబద్ధంగా దార్లు వేశారన్నారు. దీనితో రైతులు, ప్రధానంగా కౌలురైతులు, వ్యవసాయకూలీల జీవన సంక్షోభం మరింత పెరుగుతుందన్నారు. కాంగ్రెస్ ఈనాడు ఈ చట్టాలకు వ్యతిరేకంగా పెద్దగొంతుతో మాట్లాడినప్పటికీ, తాను అధికారంలో వుండగా ఇవే విధానాలను కొనసాగించిందన్నారు. వ్యవసాయరంగంలో పెట్టుబడులు పెడుతూ తమ దోపిడీకి అనుకూలంగా మార్పులు తెస్తున్నారని, ఇవి మౌలికమైనవి కావని, దున్నేవానికే భూమి నినాదంగా బడాభూస్వాములకు, వీరిని సాంఘిక పునాదిగా కలిగివున్న సామ్రాజ్యవాదులకు, వీరికి దళారీలుగా వున్న బడాబూర్జువావర్గానికీ వ్యతిరేకంగా పోరాటానికి రైతాంగ ప్రజానీకాన్ని సన్నద్ధం చేయాలన్నారు. రైతాంగానికి ఆదాయం పెరిగిందని ప్రభుత్వం చెబుతుందన్నదంతా అవాస్తవమేనన్నారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలు గ్రామాలకు వెళ్ళి రైతాంగం ఎదుర్కొంటున్న నిర్దిష్ట సమస్యలపై వారిని ఉద్యమింపజేయాలని, ప్రజలను విప్లవోద్యమంలోకి సమీకరించటమే మన కర్తవ్యమని, అదే కామ్రేడ్ జస్వంత్‌కు అందించే సరైన నివాళిగా ఆమె తన ముగింపు ఉపన్యాసంలో పేర్కొన్నారు. కోవిడ్ నిబంధనలను, జాగ్రత్తలను పాటిస్తూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి 300 మంది ఈ సంస్మరణ సభకు హాజరయ్యారు.

ooo




సిపిఐ(ఎం.ఎల్) ప్రచురణ

**విప్లవ మేధోసైనికుడు**
**కామ్రేడ్ జశ్వంతరావు**

**పేజీలు : 192** **విరాళం : రు. 100/-**

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**
**జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2**